గ్రూప్-4 అభ్యర్థుల బయోడేటా సవరణలకు అవకాశం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తమ బయోడేటాలో సవరణలు చేసుకునేందుకు గ్రూప్-4 పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు టిఎస్‌పిఎస్‌సి అవకాశం కల్పించింది. ఈ మేరకు శనివారం కమిషన్ కార్యదర్శి ఒక ప్రకటన విడుదల చేశారు. ఎడిట్ ఆప్షన్ ఒకేసారి ఉపయోగించుకోవాల్సి ఉన్నందున అభ్యర్థులు మరింత జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రశ్నాపత్రం ఇంగ్లీష్- తెలుగు, లేదా ఇంగ్లీష్-ఉర్దూ భాషల్లో ఉంటుందనీ, ఎంచుకునే సమయంలో సరి చూసుకోవాలని తెలిపారు. ఈ నెల 9 నుంచి 15 వరకు సవరణలకు అవకాశం ఇచ్చినట్టు వివరించారు.

నేడు నీట్ యుజి పరీక్ష

- 28.87 లక్షల మంది దరఖాస్తు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

దేశవ్యాప్తంగా వైద్య కళాశాలల్లో ప్రవేశాల కోసం నిర్వహించే జాతీయ అర్హత ప్రవేశ పరీక్ష (నీట్) యుజి పరీక్ష ఆదివారం జరుగనుంది. ఈ పరీక్షకు దేశవ్యాప్తంగా 20,87,449 మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారు. భారత్‌లో 499 నగరాలు, ఇతర దేశాల్లో 14 నగరాలు కలిపి మొత్తం 513 నగరాల్లో ఈ పరీక్షను నిర్వహించనున్నారు. ఆదివారం మధ్యాహ్నం రెండు గంటల నుంచి సాయంత్రం 5.20 గంటల వరకు పరీక్ష జరుగుతుంది. ఈ నెల మూడో తేదీ నుంచి దరఖాస్తు చేసిన అభ్యర్థులు అడ్మిట్ కార్డులను డౌన్‌లోడ్ చేసుకుంటున్న విషయం తెలిసిందే. తెలంగాణ నుంచి సుమారు 70 వేల మంది అభ్యర్థులు నీట్‌కు దరఖాస్తు చేసినట్టు సమాచారం. రాష్ట్రంలోని 24 కేంద్రాల్లో ఈ పరీక్షను నిర్వహించనున్నారు.

ఉచితంగా ఐఐటి, నీట్ తరగతులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పదో తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులు మొదటి ప్రయత్నంలోనే ఐఐటి-నీట్ సాధించడమెలా అనే అంశంపై మే 14 నుంచి 18వ తేదీ వరకు ఐదు రోజులపాటు ఉచిత అవగాహనా తరగతులు నిర్వహిస్తున్నట్టు హైదరాబాద్ దోమలగూడలోని మెటామైండ్ అకాడమీ డైరెక్టర్ మనోజ్ కుమార్ తెలిపారు. ఈ మేరకు శనివారం ఉచిత అవగాహనా తరగతుల పోస్టర్‌ను టిఎస్‌ఆర్‌టిసి చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మనోజ్ కుమార్ మాట్లాడుతూ అవగాహనా తరగతుల్లో సిలబస్, పరీక్షా విధానం, మెంటర్షిప్, టెస్ట్ సిరీస్, ఒత్తిడిని జయించడం ఎలా? అనే అంశాలతో పాటు రైటింగ్ స్కిల్స్, టైం మేనేజ్‌మెంట్ తదితర అంశాలుంటాయని తెలిపారు. ఉచిత రిజిస్ట్రేషన్, హాస్టల్ వసతి తదితర వివరాలకు 85229 58575, 70322 64910 నెంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ఆదివాసీ అస్థిత్వానికి ఆర్ఎస్ఎస్ ముప్పు

- జనగణన సర్వేపత్రంలో ఆదివాసీ పదం చేర్చాలి
- ఆదివాసి అధికార్ రాష్ట్రీయ మంచ్ జాతీయ నాయకులు బృందాకరత్

మహాసభలనుద్దేశించి మాట్లాడుతున్న బృందాకరత్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

'అస్థిత్వ రాజకీయాలు ఆర్ఎస్ఎస్ చేతిలో ఆయుధంగా మారాయి..హిందూత్వ ఎజెండాతో ఆదివాసీల్లోకి విరుద్ధ భావాలు చొప్పించి.. ఆదివాసీ అస్థిత్వానికి ఆర్ఎస్ఎస్ ముప్పుగా పరిణమించింది' అని ఆదివాసీ అధికార్ రాష్ట్రీయ మంచ్ జాతీయ నాయకులు బృందాకరత్ అన్నారు. జనాభా కుల గణనలో భాగంగా దేశవ్యాప్తంగా ఉన్న ఆదివాసీలకు మతంతో సంబంధం లేకుండా ప్రత్యేక కాలమ్‌ను పునరుద్ధరించాలని కోరారు. ఆదివాసీల్లోకి ప్రవేశించిన విరుద్ధ భావాలను సంఘం, సిద్ధాంతం, సంఘర్షణలతో తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. భద్రాచలం సమ్మక్క-సారలమ్మ ఫంక్షన్ హాల్‌లోని అమరవీరులు కుంజా బొజ్జి, సున్నం రాజయ్య నగర్‌లో శనివారం ఏర్పాటు చేసిన తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం- టిఎజిఎస్ మూడో మహాసభలనుద్దేశించి ఆమె ప్రసంగించారు. హిందూత్వ ఎజెండాతో ఆర్ఎస్ఎస్ విరుద్ధ భావాలను ఆదివాసీల్లో చొప్పించే ప్రయత్నం చేస్తోందన్నారు. ఆర్ఎస్ఎస్ భావజాలం అత్యంత ప్రమాదకరమని, దీనిని పోరాటాలతోనే నియంత్రించాలని సూచించారు. జార్ఖండ్‌లోని గిరిజనుల మధ్య విభేదాలు, మణిపూర్‌లో గిరిజనులు, ఆదివాసీల మధ్య అనైక్యత, తెలంగాణలో లంబాడి, ఆదివాసీల మధ్య చిచ్చు పెడుతూ ఆర్ఎస్ఎస్ పబ్బం గడుపుతోందని తెలిపారు. మేడారం సమ్మక్క, సారక్క జాతరలో ఆదివాసీ సంప్రదాయాన్ని రూపుమాపి హిందూ ఆచార వ్యవహారాలను ముందుకు తెచ్చేందుకు ఆర్ఎస్ఎస్, బిజెపి ప్రయత్నిస్తున్నాయని విమర్శించారు. ఆదివాసీ సంస్కృతికి బదులు హనుమంతుడు, రాముడు, దుర్గ, గణేష్ ఉత్సవాలను నిర్వహిస్తూ ఆదివాసీలను హిందూ మత ఆరాధకులుగా మార్చే ప్రయత్నం కొనసాగుతోందన్నారు. జనగణన సర్వే పత్రంలో ఆదివాసి అనే పదం ఎక్కడా లేదని, జార్ఖండ్ ప్రభుత్వం గిరిజనులు అనే పదాన్ని చేర్చాలని డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు. జన గణనలో ఆదివాసీ అనే పదం లేకుంటే హిందూ అనే కాలమ్‌లోనే ఆదివాసీలు నమోదు అవుతారని, తద్వారా ఆదివాసీల మధ్య వైరుధ్యం పెంచి వారి ఉనికినే అత్యంత ప్రమాదంలోకి నెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం యత్నిస్తోందని అన్నారు. జనాభా సర్వే పట్టికలో ఆదివాసీ అనే పదం చేర్చాలని డిమాండ్ చేశారు. మూఢ నమ్మకాలకు వ్యతిరేకంగా టిఎజిఎస్ చేస్తున్న పోరాటం హర్షనీయమని అన్నారు. ఆదివాసీ అధికార మంచ్‌కు 15 రాష్ట్రాల్లో అనుబంధ సంఘాలు ఉన్నట్టు చెప్పారు. మంచ్‌కు అనుబంధంగా సిఎఆర్‌డి (కార్డ్) అనే సంస్థను నెలకొల్పి ఆదివాసీ ఉద్యోగులు, విద్యార్థులు, వివిధ వర్గాల గిరిజన సమస్యలపై సర్వేలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఆశయాల కోసం అమరులైన వారి స్ఫూర్తితో ముందుకెళ్లాలని.. అందుకు తాము తోడుంటామని హామీ ఇచ్చారు.

విజయవంతంగా ముగిసిన సభలు

సంఘం రాష్ట్ర అధ్యక్షులు, మిడియం బాబురావు అధ్యక్షతన జరిగిన ఈ మహాసభలు శనివారంతో విజయవంతంగా ముగిశాయి. రాష్ట్రవ్యాప్తంగా 8 జిల్లాల నుంచి 260 మంది ప్రతినిధులు మహాసభలకు హాజరయ్యారు. మహాసభల ప్రారంభానికి ముందు మిడియం బాబురావు ముందుగా టిఎజిఎస్ పతాకాన్ని ఆవిష్కరించి కొమరం భీమ్ చిత్రపటానికి పూలమాల వేశారు. ఆహ్వాన కమిటీ అధ్యక్షులు రవివర్మ కుంజా బొజ్జి, సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తొడసం భీమ్ రావు సున్నం రాజయ్య చిత్రపటానికి పూలమాలలు వేశారు. గత మహాసభ నుంచి నేటి వరకు మృతి చెందిన అమరవీరులకు మహాసభ సంతాపం ప్రకటించింది. సిఐటియు రాష్ట్ర కార్యదర్శి మధు మహాసభలనుద్దేశించి సంఘీభావం తెలియజేశారు. అధ్యక్షవర్గం మిడియం బాబురావు, కూసం సచిన్, సున్నం గంగా, నాయకులు కారం పుల్లయ్య, పి.సోమయ్య, వజ్జా సురేష్, నగేష్ తదితరులు మొత్తం 16 తీర్మానాలను మహాసభల్లో ప్రవేశపెట్టగా ప్రతినిధులు ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ సభల్లో బండారు రవికుమార్, మచ్చా వెంకటేశ్వర్లు, అన్నవరపు కనకయ్య, ఏజె రమేష్, దుగ్గి కృష్ణ, దబ్బకట్ల లక్ష్మయ్య, ఊకే వీరస్వామి, మడివి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

బిఆర్ఎస్ నిరుద్యోగుల ఆశలు నెరవేర్చలేదు

- నిరుద్యోగ డిక్లరేషన్‌తో కాంగ్రెస్ భరోసా
- కాంగ్రెస్ ఇన్‌ఛార్జ్ మాణిక్‌రావు ఠాక్రే

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నిరుద్యోగుల ఆశలను బిఆర్ఎస్ సర్కారు నెరవేర్చలేదని రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మాణిక్‌రావు ఠాక్రే విమర్శించారు. ఈ క్రమంలోనే రానున్న కాంగ్రెస్ సర్కారు నిరుద్యోగులకు ఏం చేయబోతుందో చెప్పేందుకే 'నిరుద్యోగ డిక్లరేషన్' పేరుతో భరోసా పత్రాన్ని విడుదల చేస్తున్నట్టు తెలిపారు. ఉపాధి కరువై నిరుద్యోగులు ఎంతో నిరుత్సాహంతో ఉన్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే యూత్ డిక్లరేషన్ అమలు చేస్తామన్నారు. హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో పార్టీ నేతలు జి.నిరంజన్, శివసేనారెడ్డి, నగేష్‌ముదిరాజ్, సునీతారావు, ఆడం సంతోష్, నూతి శ్రీకాంత్, ఫిరోజ్ ఖాన్‌తో కలిసి శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. నిరుద్యోగ యువ సభకు అన్ని వర్గాల ప్రజలు తరలి రావాలని పిలుపునిచ్చారు. తెలంగాణ యువత ఆకాంక్షల మేరకు కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేసిందని గుర్తు చేశారు. బిఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తొమ్మిదేండ్లలో ప్రజల ఆకాంక్షలు నెరవేరలేదని ఆయన విమర్శించారు. ఎంపి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ నిరుద్యోగ సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఘోరంగా విఫలమవుతున్నాయని విమర్శించారు. ఉద్యోగాలు వస్తాయనే ఆశతోనే రాష్ట్ర సాధన కోసం యువత పోరాడిందని తెలిపారు. రాష్ట్రం వచ్చిన తర్వాత నిరుద్యోగ సమస్య మరింత పెరిగిందన్నారు. ఇంటికో ఉద్యోగం ఇస్తామన్న కేసీఆర్ ఊరుకో ఉద్యోగం కూడా ఇవ్వలేదని విమర్శించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమని స్పష్టం చేశారు.

కర్ణాటకలో కాంగ్రెస్సే : బెల్లయ్యనాయక్

కర్ణాటక ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు ఖాయమని ఎఐసిసి ఆదివాసీ విభాగం ఉపాధ్యక్షులు బెల్లయ్య నాయక్ ధీమా వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. మోడీకి అనుకూలమైన మీడియాలోనే బిజెపి గెలుస్తుందని చెబుతున్నారని ఎద్దేవా చేశారు. రెజ్లర్లపై చైర్మన్ లైంగిక వేధింపులకు పాల్పడుతున్నారని ఏడుస్తున్నా చర్యలు తీసుకోవడంలో మోడీ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఉద్యోగాల భర్తీ కూడా అస్తవ్యస్తంగా ఉందన్నారు.

టిఎస్ఆర్‌జెసి సెట్ ప్రవేశ పరీక్షకు 90.23 శాతం హాజరు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

టిఎస్ఆర్‌జెసి సెట్-2023 ప్రవేశ పరీక్షకు 90.23 శాతం మంది అభ్యర్థులు హాజరయ్యారు. ఈ మేరకు శనివారం టిఎస్ఆర్‌జెసి సెట్ కన్వీనర్ శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. 35 గురుకుల జూనియర్ కళాశాలల్లో 2023-24 మొదటి సంవత్సరంలో ప్రవేశానికిగాను 251 పరీక్షా కేంద్రాల్లో ఈ పరీక్ష నిర్వహించారు. పరీక్షలు రాసేందుకు 55,232 మంది హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోగా 49,836 మంది విద్యార్థులు హాజరయ్యారు.

చివరి తేదీ పొడిగింపు

టిఎస్‌పిఇసెట్ -2023కు ఆలస్య రుసుంతో దరఖాస్తు చేసుకునే గడువును ఈ నెల 16 వరకు పొడిగించారు. ఈ మేరకు టిఎస్‌పిఇసెట్ కన్వీనర్ ఒక ప్రకటన విడుదల చేశారు. బిపిఇడి లేదా డిపిఇడిలో ప్రవేశం పొందాలనుకునే అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇంటర్మీడియట్ రెండో సంవత్సరం పరీక్షలు రాసిన వారు, ఇప్పటికే ఇంటర్మీడియట్ పూర్తి చేసుకున్న వారు, డిగ్రీ ఫైనల్ సెమిస్టర్‌లో ఉన్నవారు, డిగ్రీ పూర్తి చేసుకున్న వారు ప్రవేశానికి దరఖాస్తు చేసుకునేందుకు అర్హులని తెలిపారు. మరోసారి గడువు పొడిగించేది లేదని స్పష్టం చేశారు.

హైదరాబాద్‌కు చేరుకున్న మాయావతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బిఎస్‌పి జాతీయ అధ్యక్షులు మాయావతి శనివారం హైదరాబాద్ వచ్చారు. ప్రత్యేక విమానంలో బేగంపేట విమానాశ్రయానికి చేరుకున్న ఆమెకు బిఎస్‌పి రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, రాజ్యసభ సభ్యులు రాంజీ గౌతమ్, మంద ప్రభాకర్, చంద్రశేఖర్ ముదిరాజ్ తదితరులు స్వాగతం పలికారు.

ఉద్యోగాల కోసం పోరాడాలి

మల్లు రవి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో 30 లక్షల మంది నిరుద్యోగులు ఉద్యోగాల కోసం వేచి చూస్తున్నారని టిపిసిసి ఉపాధ్యక్షులు మల్లు రవి ఆవేదన వ్యక్తం చేశారు. టిఎస్‌పిఎస్‌సి ద్వారా నోటిఫికేషన్లు ఇస్తే 15 పేపర్స్ లీకయ్యాయని విమర్శించారు. ఇంత ఘోరంగా పేపర్స్ లీక్ అయితే రాష్ట్ర ప్రభుత్వం బాధ్యత వహించి చర్యలు తీసుకోవాలన్నారు. హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో పార్టీ నేతలు మానవతారాయ్, రియాజ్, చరణ్ కౌశిక్, చారగొండ వెంకటేష్, చెరగని దయాకర్, బాలలక్ష్మితో కలిసి ఆయన శనివారం విలేకర్లతో మాట్లాడారు. అదే కమిటీ ద్వారా మళ్లీ పరీక్షలకు సమాయత్తం కావడం దుర్మార్గమన్నారు. యువత పోరాటాల ఫలితంగా వచ్చిన తెలంగాణలో యువతకు అన్యాయం జరుగుతుంటే, మరో పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

1.34 కోట్ల మందికి కంటి పరీక్షలు

- సమాచార, పౌర సంబంధాలశాఖ కమిషనర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా 1.34 కోట్ల మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. వీరిలో అవసరమైన 19,95,659 మందికి రీడింగ్ గ్లాసెస్ పంపిణీ చేశారు. ఇప్పటి వరకు 9,875 గ్రామ పంచాయతీ వార్డులు, మరో 3,058 మున్సిపల్ వార్డుల్లో పరీక్షలు పూర్తయ్యాయి. ఈ మేరకు రాష్ట్ర సమాచార, పౌర సంబంధాలశాఖ కమిషనర్ అర్వింద్ కుమార్ శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. పరీక్షలు చేయించుకున్న వారిలో 63,18,637 మంది పురుషులు, 71,20,703 మంది మహిళలు, 7,042 ట్రాన్స్‌జెండర్లున్నారు. 98,77,475 మందికి ఎలాంటి కంటి సమస్యలు లేవని నిర్ధారించారు. వంద రోజుల్లో నిర్దేశించుకున్న లక్ష్యానికి 85 శాతం పూర్తి చేసినట్టు అధికారులు తెలిపారు. జనవరి 19న ప్రారంభమైన శిబిరాలు జూన్ 15తో ముగియనున్నాయి. నివారించదగ్గ అంధత్వ రహిత తెలంగాణ లక్ష్యంతో 2018లో మొదటిసారి కంటి వెలుగు పరీక్షలను నిర్వహించగా, రెండో దఫా ఇప్పుడు నిర్వహిస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా వైద్యారోగ్యశాఖ అధికారులతో పాటు గ్రామపంచాయతీ, మున్సిపల్ తదితర శాఖల అధికారుల సమన్వయంతో కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతున్నది.

వ్యవసాయ ఎమర్జెన్సీ ప్రకటించాలి

- కోదండరెడ్డి, అన్వేష్‌రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో వ్యవసాయ ఎమర్జెన్సీ ప్రకటించాలని కిసాన్ కాంగ్రెస్ నాయకులు కోదండరెడ్డి, సుంకేట అన్వేష్‌రెడ్డి డిమాండ్ చేశారు. వర్షాలతో పంటలు, ధాన్యం తీవ్రంగా దెబ్బతిన్నాయని తెలిపారు. తడిసిన ధాన్యం, పంటలను వెంటనే కొనుగోలు చేయాలని కోరారు. నష్టపోయిన రైతులకు తగిన పరిహారం ఇచ్చి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. శనివారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో వారు విలేకర్లతో మాట్లాడారు. ధరణి లోపాలను సవరించాలంటూ హైకోర్టు ఆదేశించినా రాష్ట్ర ప్రభుత్వానికి ఏ మాత్రం చలనం లేదని విమర్శించారు. రైతుల పేరిట రాజకీయం చేస్తున్న బీఆర్ఎస్ భూముల విషయంలో రైతులకు అన్యాయం చేస్తున్నదని చెప్పారు. ధరణి సమస్యలను వెంటనే పరిష్కరించాలంటూ కోర్టు 15 రోజుల సమయం ఇచ్చిందనీ, ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి చర్యలు తీసుకుని రైతులకు తగిన న్యాయం చేయాలని కోరారు.

మన ఆరోగ్యం.. మన చేతుల్లోనే..

- మెడికవర్ హాస్పిటల్ వైద్యుల వెల్లడి

హైదరాబాద్ : ఎవరి ఆరోగ్యం వారి చేతుల్లోనే ఉందని మెడికవర్ హాస్పిటల్స్ వైద్యులు పేర్కొన్నారు. ప్రజల్లో ఆరోగ్య పరిరక్షణపై అవగాహన పెంచేందుకు ఏటా ప్రపంచ ఆరోగ్య సంస్థ "చేతుల పరిశుభ్రత దినోత్సవం"ను మే5న నిర్వహిస్తోంది. చేతులు శుభ్రం చేసుకోవడంలో ప్రాముఖ్యతను చెప్పడానికి "వరల్డ్ హ్యాండ్ హైజీన్ డే" కార్యక్రమాన్ని జాయ్ ఫౌండేషన్ ఓల్డ్ ఏజ్ హోమ్‌లో, ఆ హాస్పిటల్‌లో నిర్వహించారు. "తరచు చేతులు శుభ్రం చేసుకుంటూ ఉండడం మంచిది. అలా చేయడం వల్ల దాదాపు 80 శాతం రోగాలు రాకుండా ఉంటాయి. ప్రతి వంద మందిలో పది మందికి వచ్చే అంటువ్యాధులు చేతులు పరిశుభ్రంగా లేకుంటేనే వస్తున్నాయని ఓ అధ్యయనం తెలిపింది. తరచూ చేతులు శుభ్రం చేసుకుంటే మీతో పాటు మీ కుటుంబ సభ్యులు కూడా ఆరోగ్యంగా ఉంటారు" అని మెడికవర్ క్రిటికల్ కేర్ హెడ్ డాక్టర్ గన్శ్యామ్ జగత్కర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలు విభాగాల డాక్టర్లు కృష్ణ కిరణ్, చంద్రశేఖర్ దానన, హరిత మదిగుబ్బ, కిషన్ నాగ్, సెంటర్ హెడ్ మాత ప్రసాద్, ఆపరేషన్ హెడ్ రామసుబ్బా రెడ్డి తరితరులు పాల్గొన్నారు.

డెడ్ స్టోరేజీకి శ్రీశైలం

- తాగునీటికి తప్పని తిప్పలు
- నిబంధనలను భేఖాతరు చేస్తున్న పాలకులు
- గత 4 సంవత్సరాలలో భారీ వరదలు వచ్చినా తగ్గిన నీటి నిల్వలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మునుపెన్నడూ లేని విధంగా ఈ ఏడాది ఇప్పటికే శ్రీశైలంలో నీటి నిల్వలు తగ్గాయి. బచావత్ ఆదేశాల మేరకు రిజర్వాయర్‌లో 60 టిఎంసిల నీటి నిల్వలుండాలి. ప్రస్తుతం రిజర్వాయర్‌లో 32 టిఎంసిలు మాత్రమే ఉన్నాయి. ఎగువన నుంచే వచ్చే వరదలు ఆలస్యమైతే మున్ముందు తాగు, సాగు నీటికే కాదు పశుపక్ష్యాదులు, మత్స్య సంపదకు సైతం ముప్పువాటిల్లే అవకాశాలున్నాయి.

శ్రీశైలం గరిష్ట నీటి మట్టం 885 అడుగులు, 215.810 టిఎంసిల సామర్థ్యం కాగా 2020 మే 5 నాటికి 812.80 అడుగులు, 35.9850 టిఎంసిల నీటినిల్వలుండగా 2021 మే 5 నాటికి 807.50 అడుగులు, 32.8794 టిఎంసిల నీటినిల్వలున్నాయి. 2022 మే 5 నాటికి 812.20 అడుగులు, 35.5786 టిఎంసిల నీటి నిల్వలున్నాయి. 2023 మే 5 శుక్రవారం నాటికి 807.30 అడుగులు, 32.7876 టిఎంసిల నీటి నిల్వలున్నాయి. అయితే 25 సంవత్సరాల తర్వాత అత్యధిక వరదలు ఈ కాలంలో రిజర్వాయర్‌కు వరుసగా వచ్చినా నీటి నిల్వలు పడిపోవడానికి పాలకుల ముందు చూపు లేకపోవడం, నిర్లక్ష్యమే కారణమని తెలుస్తోంది. శ్రీశైలం రిజర్వాయర్‌లో 53.850 టిఎంసిలకు తగ్గరాదని బచావత్ ట్రిబ్యునల్ నిబంధనలు వున్నాయి. రెండు రాష్ట్రాల పాలకులకు ముందు చూపు లేకపోవడం, నిర్లక్ష్యం, ఇష్టం వచ్చిన రీతిలో ఎవరికి కావాల్సిన రీతిలో నీటిని వాడటం, తదితర కారణాలతో 32 టిఎంసీలకు పడిపోయిందనేది సాగునీటి నిపుణుల అభిప్రాయం.

గత నాలుగేండ్లలో వచ్చిన వరదలు

2019-20లో 1673.67 టీఎంసీలు
2020-21లో 1511.08 టీఎంసీలు
2021-22లో 1080.93 టీఎంసీలు
2022-23లో 1791.55 టీఎంసీల వరదలు రిజర్వాయర్‌ను తాకాయి.

ఇతర మార్గాలు లేకపోవడమేనా..

నీటిని నిలువ చేసుకునే సామర్థ్యం, ఇతర మార్గాలు లేకపోవడం వల్ల వరద మొత్తాన్ని దిగువకు వదలాల్సి వస్తోందని అధికారులు చెబుతున్నారు. అదేవిధంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపట్టిన హంద్రీనీవా, పోతిరెడ్డిపాడు, ముచ్చుమర్రి ప్రాజెక్టుల ద్వారా భారీగా నీటిని వాడేసినట్టు ఆరోపణలున్నాయి. స్పిల్‌వే ద్వారా 1,118 టిఎంసిల నీరు బయటికి వదిలారు. మిగతా నీటిని ఎడమ, కుడి విద్యుత్తు కేంద్రాల ద్వారా విద్యుత్తుత్పత్తికి వాడుతున్నారు. ఉమ్మడి రాష్ట్రంలో 836 అడగుల వరకు నీటిని వాడుకోవచ్చని 1996లో జిఓ 69 విడుదలైంది. ఆ తర్వాత 854 అడుగులలో నీటి మట్టాన్ని కొనసాగించాలన్న నిబంధనలను మార్చారు. అయితే వర్షాభావ పరిస్థితులు, తాగునీటికి గడ్డు పరిస్థితులేర్పడితే 854 అడుగుల కంటే దిగువకు వాడుకోవచ్చని 2005లో జిఓ 107ను తెచ్చారు. నిబంధనలను పట్టించుకోకుండా 2023లో 807 అడుగుల వరకు వాడుకోవడం వల్ల అనేక అనర్థాలకు దారితీసిందన్నది అధికార వర్గాల వాదన.

మరో 15 టిఎంసిల ఖాళీ అయితే ఊహించని విపత్తే

శ్రీశైలం రిజర్వాయర్‌లో ప్రస్తుతం 32 టిఎంసిల నీటి నిల్వలు ఉన్నాయి. లీకేజీలు, నీటి ఆవిరి, తాగునీటి అవసరాలకు మరో 15 టిఎంసిల నీటిని వాడితే భవిష్యత్తులో శ్రీశైలం రిజర్వాయర్‌లో మిగిలేది బురదే. అత్యధిక ఉష్ణోగ్రతలు ఏర్పడితే రిజర్వాయర్‌లోని నీరంతా ఆవిరైపోతుందని సాగునీటి శాఖ ఇంజినీర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

విద్యుత్తు ఉత్పత్తి కోసం నీటి వాడకం

శ్రీశైలం ప్రాజెక్టుకు ఈ ఏడాది అత్యధిక వరదలు వచ్చినప్పటికీ ప్రభుత్వ విధానాల మేరకు విద్యుతు ఉత్పత్తికి నీటిని వాడడం జరిగింది. ప్రతి ఏటా వరదలు వచ్చి నీటి సమస్య తీరుతుందన్న నమ్మకం ఉంది. రిజర్వాయర్‌లోకి అధిక వరద వచ్చినప్పుడు గేట్లు ఎత్తడం, దించడం తప్ప మిగతావేవి మా చేతుల్లో లేవు. ప్రాజెక్టుకు సంబంధించిన నివేదికలు ఎప్పటికప్పుడు రాష్ట్ర ప్రభుత్వానికి తెలియజేస్తున్నాం.

డిజిరెడ్డి, ఎస్ఇ. శ్రీశైలం ప్రాజెక్టు

హరితహారం అద్భుతం.. పరుచుకున్న పచ్చదనం

- కర్ణాటక రాష్ట్ర అడవులు, పర్యావరణ శాఖ అడిషనల్ చీఫ్ సెక్రటరీ జావేద్ అక్తర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణకు హరితహారం కార్యక్రమం అద్భుతమనీ, దాని ఫలితంగా ఎక్కడ చూసినా పచ్చదనం పరుచుకున్నదని కర్ణాటక రాష్ట్ర అడవులు, పర్యావరణ శాఖ అడిషనల్ చీఫ్ సెక్రటరీ జావేద్ అక్తర్ ప్రశంసించారు. ఆ కార్యక్రమం అమలులో ప్రభుత్వ సంకల్పం, అధికారులు, సిబ్బంది కృషి, ప్రజల సహకారం అడుగడుగునా కనిపిస్తున్నదని చెప్పారు. తెలంగాణకు హరితహారం ద్వారా పట్టణ ప్రాంతాల్లో పచ్చదనం పెంపు జరిగిన క్రమంపై అధ్యయనం చేసేందుకు ఆయన శనివారం హైదరాబాద్ వచ్చారు. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లాల్లో పర్యటించి దూలపల్లి ఫారెస్ట్ రీసెర్చ్ నర్సరీ, కండ్లకోయ ఆక్సిజన్ అర్బన్ ఫారెస్ట్ పార్క్, ఔటర్ రింగ్ రోడ్డు వెంట పచ్చదనం, అలాగే హైదరాబాద్‌లో అంతర్గత రోడ్ల వెంట ఎవెన్యూ ప్లాంటేషన్ (రహదారి వనాలు), మీడియన్ ప్లాంటేషన్లను పరిశీలించారు. సిఎం ఓఎస్‌డి (హరితహారం) ప్రియాంక వర్గీస్ స్వయంగా కర్ణాటక అధికారికి హరితహారం కార్యక్రమాలను వివరించారు. ఈ సందర్భంగా జావేద్ అక్తర్ మాట్లాడుతూ.. కండ్లకోయ ఆక్సిజన్ అర్బన్ ఫారెస్ట్ పార్క్‌ను చాలా చక్కగా అభివృద్ధి చేశారన్నారు. రాష్ట్ర మంతటా ఇదే తీరులో 109 ఫారెస్ట్ పార్కులను పర్యావరణ పరంగా ఏర్పాటు చేయటం అభినందనీయమని కొనియాడారు. ఔటర్ రింగ్ రోడ్డుతో పాటు, నగరంలోనూ పచ్చదనం కోసం తీసుకుంటున్న చర్యలు బాగున్నాయన్నారు. కర్నాటక ప్రభుత్వం కూడా పట్టణ ప్రాంతాల్లో పచ్చదనం పెంపునకు ప్రణాళికలు రూపొందిస్తోందని, ఆ అధ్యయనంలో భాగంగా తెలంగాణలో పర్యటిస్తున్నామని తెలిపారు. క్షేత్రస్థాయి పర్యటన తర్వాత అరణ్యభవన్‌లో అటవీ సంరక్షణ ప్రధాన అధికారి (పీసీసీఎఫ్, హెచ్ఓఎఫ్) ఆర్ఎం. డోబ్రియాల్, కంపా పీసీసీఎఫ్ లోకేష్ జైస్వాల్, విజిలెన్స్ పీసీసీఎఫ్ ఏలూసింగ్ మేరుతో జావేద్ అక్తర్ సమావేశమయ్యారు. తెలంగాణకు హరితహారం కార్యాచరణ, ఫలితాలను పీసీసీఎఫ్ డోబ్రియాల్ ఈ సందర్భంగా వివరించారు. పర్యటనలో హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి డీఎఫ్ఓలు ఎం. జోజి, సుధాకర్ రెడ్డి, జానకి రామ్‌తో పాటు, అటవీశాఖ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

'గీతన్న బీమా' కార్మికులకు ఉపయోగపడాలి

- తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గీతన్న బీమా పథకం విధివిధానాలు కార్మికులకు ఉపయోగపడే విధంగా రూపొందించాలని తెలంగాణ కల్లు గీత కార్మిక సంఘం (కెజికెఎస్) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎంవి రమణ, బెల్లంకొండ వెంకటేశ్వర్లు శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. గీత కార్మికులకు ప్రభుత్వం ప్రస్తుతం ఇస్తోన్న ఎక్స్‌గ్రేషియాను రూ.10 లక్షలకు పెంచాలని కోరారు. గత 45 ఏండ్లుగా ఎక్స్‌గ్రేషియా విధానం అమలవుతున్నదని తెలిపారు. గీత కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కును తొలగించవద్దని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఎక్స్‌గ్రేషియా అంటేనే తక్షణ సహాయమని పేర్కొన్నారు. ఎక్స్‌గ్రేషియా ఆలస్యం అవుతుందన్న పేరుతో బీమాకు మారుస్తున్నామని చెప్పడం సరైంది కాదని తెలిపారు. ఉమ్మడి రాష్ట్రంలో నాటి ప్రభుత్వాలు ఐసిఐసి, ఓరియెంటల్ ఇన్సూరెన్స్ సంస్థలకు ఇచ్చారని గుర్తు చేశారు. గీతన్న భీమా పథకం సభ్యత్వం ఉన్న గీత కార్మికులందరికీ వర్తింప చేయాలని డిమాండ్ చేశారు. ప్రమాదవశాత్తు మరణించిన వారితోపాటు రైతులకు ఇచ్చినట్లే సహజ మరణాలకు కూడా వర్తింపజేయాలని కోరారు. భూమి ఉన్న గీత కార్మికులకు వృత్తిలో ప్రమాదం జరిగితే రైతు బీమాతో పాటు గీతన్న బీమా వర్తింప చేయాలని విజ్ఞప్తి చేశారు. ఎక్సైజ్ విధానంలో నిర్ణయించినట్టు వయస్సు 18 సంవత్సరాల నుంచి 65 సంవత్సరాల వరకు ఉన్నవారికి వర్తింపజేయాలని డిమాండ్ చేశారు.

In the Court of the Hon'ble Principal Senior Civil Judge Cum MACT-III at BALLARI
M.V.C. No. 1005/2022

Between:-
Maddannagari Thippeswamy @ Boya Thippeswamy ... **Petitioner**
And
G. Obuleshu & Others ... **Respondents**

Notice to the Respondent No.1

G. Obuleshu @ G. Obilesh S/o. G. Obulapathi, aged about 33 years, Driver of the Bolero Reg No. AP 39/TN8406 R/o. D.No.1-83, Pallerla Village, Atmakur Mandalam, Nalgonda District - 508111

WHEREAS, the above petitioner has filed the above cliaim petition under setion 166 of IMV Act against you being the driver of the Driver of the Bolero Reg No. AP 39/ TN 8406for seeking compensation on account of injuries sustained to petitioner on 22.04.2021 at about 8.00 p.m. at Auto Standa, Doddagatta Village, Kalyanadurga Town, which comes under the jurisdiction of Kalyandurga Town Police Station.

You are hereby directed to appear in this court in person or by a pleader duly instructed on 15/06/2023 at about 11.00 a.m. in the forenoon before this Honourable court to show cause against he above petition, failing wherein the petition will be heard and determined ex-parte.

Given under my had and seal of the court on this 24 day of 04, 2023

By order of the Court
B. JAGANNATHA
Advocate for the petitioner

IN THE HIGH COURT OF JUDICATURE AT MADRAS (ORDINARY ORIGINAL CIVIL JURISDICTION) ARB.
O.P. (COM. DIV) NO . 672 OF 2022
In the matter of the Arbitration & Conciliation Act 1996 And In the matter of an Arbitration agreement dated 24.06.2019
M/s Arpad Cine Factory Pvt. Ltd., Represented by its Director, Mr. S. Sathish Kumar, Old No.33, New No. 18/A, 1st street Kamdar Nagar, Nungambakkam, Chennai 600034
...Petitioner
- Vs-
1.Mr.Gudluri Ashok Babu, No. 13-6-267/73, Karwan road, Salyanaryan Nagar, Talla gadda, Hyderabad, Telangana-500006
2. Amazon Seller Services Pvt. Ltd., No.26/1, 8th floor, Brigade Gateway, Dr. Rajkumar Road, Malleshwaram (west) Banglore-560055.
...Respondents
Sub :Notice in Arb. O.P. (COM. DIV) No .672 of 2022 Before the Hon'ble High Court at Chennai
Sir/ Madam
The above case filed by the Petitioner against the Respondents in which the paper publication was ordered on 27.04.2023 against the 1st Respondent and it has been posted for your appearance on **22.06.2023** . If you fail to appear in the above matter on the said date at **10-30** a.m. Before the Hon'ble High Court at Chennai , the matter is liable to be heard and decided in your absence.
K. NAGARAJAN, M.A., B.L.
Advocate
Counsel for Petitioner
No.55, Montieth Road, 2nd Floor, Embossy, Tower, Egmore, Chennai,
Mobile : 9884004075

రానున్న రెండేళ్లలో వేల ఉద్యోగాలు

- మహబూబ్‌నగర్ ఐటి టవర్ ప్రారంభోత్సవంలో కెటిఆర్
- అమరరాజా లిథియం ఫ్యాక్టరీకి శంకుస్థాపన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రానున్న రెండు మూడేండ్లలో వేల ఉద్యోగాలు కల్పించనున్నామని, ఐటి కారిడార్ ఏర్పాటుతో మహబూబ్‌నగర్ ముఖచిత్రం మారిపోతుందని ఐటి శాఖ మంత్రి కెటిఆర్ అన్నారు. మహబూబ్‌నగర్ సమీపంలోని దివిటిపల్లి వద్ద 40 కోట్ల రూపాయలతో నిర్మించిన ఐటి టవర్‌ను కెటిఆర్ శనివారం ప్రారంభించారు. అంతేకాక జాతీయ రహదారి నుంచి ఐటి టవర్ వరకు నిర్మిస్తున్న వంద అడుగుల వెడల్పు కలిగిన రహదారి పనులను ప్రారంభించారు. అదేవిధంగా రూ.9500 కోట్ల పెట్టుబడితో ఐటి కారిడార్ వద్ద అమరరాజా కంపెనీ ఏర్పాటు చేయబోయే అతిపెద్ద లిథియం ఫ్యాక్టరీకి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కెటిఆర్ మాట్లాడుతూ వలసలు, కన్నీళ్ళకు మారుపేరైన మహబూబ్‌నగర్ జిల్లాలో లిథియం ఫ్యాక్టరీని ఏర్పాటు చేసేందుకు అమరరాజా గ్రూపు ముందుకురావడం సంతోషమన్నారు. తెలంగాణ రాష్ట్రంలో పరిశ్రమలు పెట్టేందుకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని రకాల సదుపాయాలను కల్పించామని తెలిపారు. దేశంలో 80 కోట్ల మంది యువత ఉన్నారని, వీరందరికీ ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించడం సాధ్యం కాదన్నారు. ప్రభుత్వ ప్రయివేటు భాగస్వామ్యంతో పరిశ్రమలు, ఐటి కంపెనీలకు ఏర్పాటు చేయడం వల్ల ప్రత్యక్షంగా, పరోక్షంగా ఎంతోమందికి ఉద్యోగావకాశాలు వస్తాయన్నారు. హైదరాబాదులో ఐటి ప్రారంభం చేసినప్పుడు 3,20,000 మందికి పని కల్పిస్తే ఇప్పుడు పది లక్షల మంది పనిచేస్తున్నారని తెలిపారు. అమరరాజా కంపెనీ మొదటి సంవత్సరంలో 3000 కోట్ల రూపాయలతో లిథియం ఫ్యాక్టరీలో పెట్టుబడి పెడుతుందని, దశలవారీగా పెట్టుబడి పెంచే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. ఈ బ్యాటరీ పరిశ్రమ ద్వారా ఎలాంటి కాలుష్యం ఉండదని చెప్పారు. ఇది లిడ్ ఆసిడ్ పరిశ్రమ కాదని, లిథియం ఫ్యాక్టరీ అని మంత్రి స్పష్టం చేశారు.

రాష్ట్ర ఎక్సైజ్, క్రీడలు, సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి డాక్టర్ వి.శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ దివిటిపల్లి వద్ద ఐటి టవర్ ప్రారంభం జిల్లాలో మరచిపోలేని రోజన్నారు. గతంలో మహబూబ్‌నగర్ జిల్లా వాసులు పొట్ట చేత పట్టుకుని వలసలు వెళ్లేవారని, ఇప్పుడు ఆ పరిస్థితులు లేకుండా ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపట్టిందన్నారు. ఐటి కోసం మహబూబ్‌నగర్ జిల్లాలో 400 ఎకరాలు కేటాయించామన్నారు. అమరరాజా కంపెనీ అతిపెద్ద లిథియం ఫ్యాక్టరీని ఏర్పాటు చేసేందుకు ముందుకు రావడం పట్ల ఆయన వారిని అభినందించారు. అలాగే 8 కంపెనీలు ఐటి కారిడార్‌లో వారి యూనిట్లో నెలకొల్పేందుకు ఒప్పందం చేసుకున్నట్టు మంత్రి తెలిపారు. ఇందులో అమెరికా కంపెనీ కూడా ఒకటి ఉందని వెల్లడించారు. కార్యక్రమంలో అమరరాజా కంపెనీ కో- ఫౌండర్ గల్లా అరుణకుమారి, కంపెనీ ఫౌండర్ డాక్టర్ రామచంద్ర నాయుడు, ఎపికి చెందిన ఎంపి గల్లా జయదేవ్, మహబూబ్‌నగర్ పార్లమెంట్ సభ్యులు మన్నే శ్రీనివాస్ రెడ్డి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ స్వర్ణ సుధాకర్ రెడ్డి, ప్రిన్సిపల్ సెక్రెటరీ జయేష్ రంజన్, స్పెషల్ సెక్రెటరీ విష్ణువర్ధన్, జిల్లా కలెక్టర్ జి.రవినాయక్, టిఎస్ఐఐసి మేనేజింగ్ డైరెక్టర్ నరసింహారెడ్డి, ఎమ్మెల్యేలు సి.లక్ష్మారెడ్డి, ఆల వెంకటేశ్వర్ రెడ్డి, జైపాల్ యాదవ్, బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, ఎమ్మెల్సీ దామోదర్‌రెడ్డి, గోరేటి వెంకన్న, కసిరెడ్డి నారాయణరెడ్డి, పరిగి శాసనసభ్యులు మహేష్‌రెడ్డి, జిల్లా ఎస్పీ కే. నరసింహ, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

వీర జవాన్ మృతికి సిపిఎం సంతాపం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వీర జవాన్ అనిల్ మృతికి సిపిఎం రాష్ట్ర కమిటీ సంతాపాన్ని ప్రకటించింది. రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలం మల్కాపూర్ గ్రామానికి చెందిన ఆర్మీ జవాన్ జమ్ముకాశ్మీర్ హెలికాప్టర్ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోవడం తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించిందని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అనిల్ మృతికి సంతాపం తెలియజేస్తూ, ఆయన కుటుంబ సభ్యులకు సానుభూతిని ప్రకటించారు. అనిల్ కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. వీర జవాన్ల త్యాగాల వల్ల దేశ ప్రజలు స్వేచ్ఛగా, నిర్భయంగా జీవించగలుగుతున్నారని తెలిపారు. అలాంటి వీరజవాన్లందరికీ జోహార్లు తెలిపారు.

తడిసిన ధాన్యాన్ని ఎప్పుడు కొంటారు?

- వైఎస్ షర్మిల

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తడిసిన వడ్లను ఎప్పుడు కొంటారో చెప్పాలని వైఎస్ఆర్‌టిపి రాష్ట్ర అధ్యక్షులు వైఎస్ షర్మిల శనివారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. వడ్లకు మొలకలు వచ్చి రైతన్న రోదిస్తున్నారని తెలిపారు. ఒక పక్క వానలు పడుతున్నా కొనుగోలు సెంటర్లు తెరవడం లేదని పేర్కొన్నారు. మరో పక్క మిల్లర్లు కోతలు పెట్టి కాంటాలు వేస్తున్నారని తెలిపారు. మహారాష్ట్ర రైతులకు మాయమాటలు చెప్పి కండువాలు కప్పే సిఎం కెసిఆర్‌కు.. రాష్ట్ర రైతుల కష్టాలు కనిపించడం లేద అని ఆమె వాపోయారు. తడిసిన వడ్లు కొనడంతో పాటు ఎకరాకు రూ. 30వేల నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు

ప్రతి నెల రెండో సోమవారం

పిఎం నేషనల్ అప్రెంటిషిప్ మేళా

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రతి నెల రెండో సోమవారం ప్రైమ్ మినిస్టర్ నేషనల్ అప్రెంటిస్‌షిప్ మేళా (పీఎంఎన్ఏఎం)ను నిర్వహించనున్నట్టు ఇంటర్ విద్యా కమిషనర్ తెలిపారు. ఈ మేరకు ప్రొసీడింగ్స్ జారీ చేశారు. ఆ క్రమంలో ఈ నెల 8న హైదరాబాద్‌లోని జూపార్క్ ఎదురుగా ఉన్న ఐటీఐలో మేళాను నిర్వహించనున్నట్టు తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి రెండు గంటల వరకు నిర్వహించే ఈ కార్యక్రమంలో వొకేషనల్ ఇంజినీరింగ్, టెక్నికల్ కోర్సులు పూర్తి చేసిన వారు తమ బయోడేటా తో హాజరు కావాల్సి ఉంటుంది. మరిన్ని వివరాలకు 040-2446 1815 నెంబరును సంప్రదించాలని కమిషనర్ తెలిపారు.

ట్రెజరీ బిల్లులన్నీ తిరస్కరించడం సరికాదు

- టిఎస్‌టిఎఫ్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల జీతాలు, ఇతర బిల్లుల చెల్లింపుల్లో రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాన్ని పున్ణ సమీక్షించాలని తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కావలి అశోక్ కుమార్, కటకం రమేష్ కోరారు. ట్రెజరీకి సమర్పించిన బిల్లులు కొన్ని నెలలుగా ఈ కుబేర్‌లో పెండింగ్‌లో పెట్టి ఏక మొత్తంగా రిజెక్ట్ చేయడం సరైందికాదని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వైద్య ఖర్చులు, కుటుంబ ఖర్చులు, పిల్లల ఉన్నత విద్యాభ్యాసం, వివాహ ఖర్చులు, గృహ నిర్మాణ సంబంధించినటువంటి అవసరాల కోసం సమర్పించిన బిల్లులను తిరస్కరించి...కొత్త టోకెన్లు తీసుకోవాలని చెప్పడం ఉపాధ్యయులను ఆవేదనకు గురి చేస్తున్నదని పేర్కొన్నారు.

ఐకెపి విఓఎల సమ్మె ముందుకే

- 8 నుంచి 22 వరకు దశలవారీగా నిరసనలు
- 21న డివిజన్ కేంద్రాల్లో బతుకమ్మలు
- 22న కలెక్టరేట్ల ముట్టడి : సిఐటియు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర సర్కారు, అధికారుల బెదిరింపులు, అసత్య ప్రచారాలు, ఆటంకాల మధ్య ఐకెపి విఓఎల సమ్మె జరుగుతున్నదనీ, వాటికి భయపడకుండా సమస్యలు పరిష్కారం అయ్యే వరకు సమ్మె కొనసాగుతుందని ఐకెపి విఒఎ సంఘం గౌరవాధ్యక్షులు ఎస్‌వి రమ స్పష్టం చేశారు. తెలంగాణ ఐకెపి విఒఎ ఉద్యోగుల సంఘం (సిఐటియు) సమావేశాన్ని శనివారం హైదరాబాద్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు రాష్ట్ర కార్యదర్శి జె.వెంకటేశ్, కోశాధికారి వి.రాములు, కార్యదర్శులు శ్రీకాంత్, ఈశ్వర్‌రావు, ఐకెపి విఒఎ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.రాజ్‌కుమార్, ఎం.నగేశ్, వర్కింగ్ ప్రెసిడెంట్ వి.సుధాకర్, కోశాధికారి సుమలత తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రమ మాట్లాడుతూ.. విశాల దృక్పథంలేని కొన్ని సంఘాలు సమస్యల పరిష్కారం కోసం ఐక్య ఉద్యమాల్లో కలిసి రాకుండా అసత్య ప్రచారాలు చేయడాన్ని తప్పుబట్టారు. వేలాది కుటుంబాలు రోడ్డున పడుతున్నా పట్టదా? అని ఆయా సంఘాల నేతలను ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం చర్చలకు పిలిచినా రావడం లేదని ప్రచారం చేయడం తగదన్నారు. తమ తొమ్మిది డిమాండ్లలో ఇన్ని పరిష్కరిస్తాం... వీటిని పరిశీలిస్తాం... ఇవి సాధ్యం కాదనే విషయాన్ని సర్కారు మాట వరుసకు కూడా చెప్పకపోవడం దారుణమన్నారు. ఉద్యోగులే కదా అని చిన్నచూపు చూస్తే వారే సరైన సమయంలో సరైన బుద్ధిచెబుతారని హెచ్చరించారు. అధికారులు కూడా అధికార పార్టీకి వత్తాసు పలకడం సరికాదన్నారు. ఈ నెల 8 నుంచి 22వ తేదీ వరకు దశలవారీగా పోరాటాన్ని నిర్వహించనున్నట్టు తెలిపారు. రాజ్‌కుమార్, నగేశ్ మాట్లాడుతూ... ఈ నెల 8న ఐకెపి విఓఎలతో మండల స్థాయిలో రౌండ్‌టేబుల్ సమావేశాలను నిర్వహిస్తామన్నారు. 9, 10 తేదీల్లో ర్యాలీలు, ధర్నాలు చేపట్టి మంత్రులు, ఎమ్మెల్యేలకు వినతిపత్రాలు అందజేస్తామన్నారు. 11, 12 తేదీల్లో తమ పోరాటాన్ని సిఎం కెసిఆర్, పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు దృష్టికి తీసుకెళ్లేందుకు పోస్టుకార్డు ఉద్యమాన్ని చేపడతామన్నారు. 14న విఓఎలంతా కుటుంబ సభ్యులతో నిరసన చేపట్టాలని కోరారు. 15,16 తేదీల్లో అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ కార్యాలయాల ముందు సామూహిక దీక్షలు చేస్తామని చెప్పారు.

18న మహిళా సమాఖ్య సభ్యులతో ప్రదర్శనలు చేపట్టి ఆర్డీఓ కార్యాలయం ముందు ధర్నా చేస్తామని తెలిపారు. 21న డివిజన్ కేంద్రాల్లో బతుకమ్మ ఆడాలనీ, అదే రోజు సమ్మె శిబిరాల్లోనే పడుకుంటారని పేర్కొన్నారు. 22న కలెక్టరేట్లను ఎస్‌హెచ్‌జీ సభ్యులతో ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమాలన్నింటినీ ఐకేపీ వీఓఏలు జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. .

రిజర్వేషన్ల వర్గీకరణకు సానుకూలంగా స్పందించండి

మాయావతికి మంద కృష్ణ లేఖ

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

ఎస్‌సి రిజర్వేషన్ల వర్గీకరణకు సానుకూలంగా స్పందించాలంటూ ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మంద కృష్ణ మాదిగ శనివారం బిఎస్‌పి జాతీయ అధ్యక్షులు మాయావతికి బహిరంగ లేఖ రాశారు. సామాజిక న్యాయానికి విలువనివ్వాలని ఆమెను కోరారు. ఎస్‌సి రిజర్వేషన్లను వర్గీకరించాలని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎంఆర్‌పిఎస్) 29 ఏండ్లుగా పోరాడుతున్నదని తెలిపారు. రాజ్యాంగంలో పొందుపరిచిన ఎస్‌సి రిజర్వేషన్లను ప్రతి రాష్ట్రంలో ఒకటో రెండో కులాలు వారు జనాభా కంటే అదనంగా రిజర్వేషన్లు పొందుతున్నారని తెలిపారు.

దీంతో ఎస్‌సిల్లోని ప్రతి కులానికి రావాల్సిన వాటా దక్కటం లేదని పేర్కొన్నారు. విద్య, ఉద్యోగం, సంక్షేమ, రాజకీయ రంగాల్లో ఎస్‌సిల్లోని మెజార్టీ కులాలు వెనుకబడిపోతున్నాయని తెలిపారు. ప్రతి కులానికి న్యాయం జరిగేలా రిజర్వేషన్లను వర్గీకరించాలంటూ కేంద్రంలోనూ, వివిధ రాష్ట్రాల్లోనూ గతంలో నియమించిన కమిషన్‌లన్నీ సూచించాయని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలోనే అంబేద్కర్, కాన్షీరాం దృక్పథంతో పోరాడుతున్న ఎంఆర్‌పీఎస్‌కు మద్దతు ప్రకటించాలని మాయావతిని ఆయన కోరారు.

క్రమంగా పెరుగుతున్న ఉష్ణోగ్రతలు

బంగాళాఖాతంలో అల్పపీడనం

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతున్నాయి. మహబూబాబాద్ జిల్లా కొమ్ములవంచలో 40.9 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. చాలా ప్రాంతాల్లో 40 డిగ్రీలు దాటాయి. వచ్చే రెండుమూడ్రోజుల్లో గరిష్టంగా మూడు నుంచి ఐదు డిగ్రీల మేర ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశముంది. గరిష్ఠంగా 43 డిగ్రీల వరకు నమోదయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. హైదరాబాద్ చుట్టుపక్కల ప్రాంతాల్లోనూ ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలు దాటొచ్చని వాతావరణ నిపుణులు పేర్కొన్నారు. శనివారం ఉదయం బంగాళాఖాతం పరిసర ప్రాంతాల్లో ఉపరితల ఆవర్తనం ఏర్పడింది. అది సముద్ర మట్టం నుంచి ట్రోపోస్పిరిక్ స్థాయి వరకు కొనసాగుతున్నది. దీని ప్రభావంతో సోమవారం నాటికి అల్పపీడనం ఏర్పడనున్నది. అది కాస్తా ఆగ్నేయ బంగాళాఖాతంలో వాయుగుండంగా కేంద్రీకృతమయ్యే అవకాశముంది. ఆ తర్వాత మధ్య బంగాళాఖాతంవైపు కదులుతూ తుపాన్‌గా బలపడే సూచనలు కనిపిస్తున్నాయి. అయితే, దీని ప్రభావం వల్ల తెలంగాణలో పొడి వాతావరణం ఏర్పడే అవకాశాలున్నాయి. ఇదే క్రమంలో పగటిపూట గరిష్ట ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగనున్నాయి. దీంతో పాటు రాబోయే మూడు రోజుల పాటు రాష్ట్రంలో అక్కడక్కడా తేలికపాటి నుంచి మోస్తరు వానలు పడే సూచనలు కనిపిస్తున్నాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. రాష్ట్రంలో శనివారం రాత్రి 10 గంటల వరకు 150కిపైగా ప్రాంతాల్లో వర్షం పడినట్టు టిఎస్‌డిపిఎస్ తన నివేదికలో పేర్కొంది. వికారాబాద్ జిల్లా కోటేపల్లిలో అత్యధికంగా 7.3 సెంటీమీటర్ల వర్షం కురిసింది. 37 ప్రాంతాల్లో మోస్తరు వానపడగా..మిగతా ప్రాంతాల్లో తేలికపాటి జల్లులు పడ్డాయి.

బిల్లులు చెల్లించాలని పెట్రోల్ డబ్బాలతో సర్పంచుల నిరసన

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

నాలుగేండ్లుగా చేసిన పనులకు బిల్లులు రావడం లేదని, కనీసం పంచాయతీ సిబ్బందికి జీతాలు ఇచ్చే పరిస్థితి లేదని కొందరు సర్పంచులు పెట్రోల్ డబ్బాలతో సమావేశానికి వచ్చిన సంఘటన శనివారం జగిత్యాలలో చోటు చేసుకుంది. జగిత్యాల రూరల్ మండల సర్వసభ్య సమావేశం ఇన్‌చార్జి ఎంపిపి రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సమావేశానికి కొందరు సర్పంచ్‌లు పెట్రోల్ డబ్బులతో రావడంతో సమావేశం రసాభాసగా మారింది. ఒక్కో సర్పంచ్‌కు రూ.40 లక్షల నుంచి రూ.50 లక్షల వరకు బిల్లులు రావాలన్నారు. దీంతో తాము అప్పులపాలు అయ్యామని పెండింగ్‌లో ఉన్న బిల్లులను అధికారులు వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకుంటామని ఆవేదన వ్యక్తంచేశారు. వాటిని కవర్ చేసేందుకు వెళ్లిన మీడియాపై ఇన్‌చార్జి ఎంపిపి మీడియా కవరేజ్ మాకు అక్కర్లేదంటూ.. బయటకెళ్లండంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో మీడియా మిత్రులు ఎంపీపీ వైఖరికి గాను నిరసనకు దిగారు. దీంతో దిగొచ్చిన ఎంపీపీ మీడియా మిత్రులు, సర్పంచ్‌లకు క్షమాపణ చెప్పారు.

జూనియర్ పంచాయతీ కార్యదర్శులను క్రమబద్ధీకరించాలి

సిఎంకు చాడ లేఖ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రొబేషన్ కాలాన్ని పూర్తి చేసుకున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శుల ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని సిపిఐ జాతీయ నాయకులు చాడ వెంకటరెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం సిఎం కెసిఆర్‌కు ఆయన లేఖ రాశారు. 'గ్రామ పంచాయతీకి ఒక కార్యదర్శిని నియమించే బదులుగా ప్రభుత్వం జూనియర్ పంచాయతీ కార్యదర్శులను నియమించింది. రాష్ట్ర వ్యాప్తంగా జూనియర్ పంచాయతీల నియామకం కోసం నాలుగేండ్లు ప్రొబేషన్ కాలం పూర్తి చేసిన తరువాత వారి ఉద్యోగాలను క్రమబద్ధీకరిస్తున్నట్టు ప్రకటించారు. వీరిని 2022 ఏప్రిల్ 11 వరకు ప్రొబేషన్ కాలం పూర్తయిన వారిని క్రమబద్ధీకరిస్తామంటూ నోటిఫికేషన్‌లో వివరించారు. ఆ తరువాత ప్రొబేషన్ పిరియిడ్‌ను మరో ఏడాది పెంచారు. 2023 ఏప్రిల్ 11 వరకు గడువు పూర్తవుతుంద'ని తెలిపారు. ఆ తరువాత ప్రొబేషనల్ కాలాన్ని పూర్తి చేసి రెగ్యులరైజేషన్ చేస్తారనే ఆశతో జూనియర్ పంచాయతీ కార్యదర్శులు ఎదురు చూస్తున్నారని చాడా పేర్కొన్నారు. ఇప్పటివరకు వారి ఉద్యోగాలు క్రమబద్ధీకరించకపోవడంతో తీవ్ర మానసిక వేదనకు గురైతున్నారని తెలిపారు. కొంతమంది విధి నిర్వహణలో మృతి చెందారని గుర్తుచేశారు. ఆయా కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలనీ, నోటిఫికేషన్‌లో పేర్కొన్న విధంగా జూనియర్ పంజాయతీ కార్యదర్శులను రెగ్యులర్ చేస్తూ నాలుగు సంవత్సరాల ప్రొబేషనరీ కాలాన్ని సర్వీస్ కాలంగా గుర్తించటానికి జీవోను వెంటనే విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. ఔట్‌సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులను జూనియర్ పంచాయతీ కార్యదర్శులుగా మార్చి రెగ్యులర్ చేయాలని కోరారు. గ్రామపంచాయతీ అభివృద్ధి పనుల్లో జూనియర్ పంచాయతీ కార్యదర్శుల పాత్ర కీలకమని తెలిపారు.

సైన్స్‌పై అవగాహన అవసరం

- డార్విన్ పరిణామ సిద్ధాంతాన్ని పాఠ్యపుస్తకాల్లో తిరిగి ప్రవేశపెట్టాలి
- శాంతిస్వరుప్ భట్నాగర్ అవార్డు గ్రహీత మోహన్ రావు
- ఘనంగా జనవిజ్ఞాన వేదిక నాలుగో వార్షిక సభలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

విద్యార్థులతోపాటు ప్రజలకు కూడా సైన్స్ పట్ల అవగాహన కల్పించాలని శాంతిస్వరుప్ భట్నాగర్ ఆవార్డు గ్రహీత, సెంటర్ ఫర్ సెల్యూలర్ మాలిక్యులర్ బయాలజీ పూర్వ సంచాలకులు డాక్టర్ సిహెచ్. మోహన్‌రావు, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షులు మోహనరావు తెలిపారు. నల్లగొండ జిల్లా కేంద్రంలోని మనోరమ హోటల్లో జన విజ్ఞాన వేదిక (జెవివి) తెలంగాణ రాష్ట్ర 4వ వార్షిక మహాసభలను ఘనంగా నిర్వహించారు. మొదటి రోజు శనివారం జెవివి జెండాను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. సమాజంలో రెండు వాదనలు ఉంటాయని, పక్కవారి వాదనలను ఖండించాల్సిన అవసరం లేదని, మీ వాదనను ప్రజలకు, సమాజానికి వివరించాలన్నారు. డార్విన్ సిద్ధాంతాన్ని విద్యార్థులకే కాకుండా ప్రజలకు కూడా వివరించాలన్నారు. సైన్స్ టీచర్లకు కూడా సైన్స్ పట్ల శిక్షణ ఇవ్వాలన్నారు. డార్విన్ సిద్ధాంతంతో పాటు ప్రముఖ శాస్త్రవేత్తలు, రచయితలు రూపొందించిన సిద్ధాంతాలను గురించి వివరించారు. నల్లగొండ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి మాట్లాడుతూ డార్విన్ సిద్ధాంతాన్ని పదవ తరగతి పాఠ్యాంశాల్లో నుంచి తీసేయడం సరైందికాదని, తిరిగి పునరుద్ధరించాలన్నారు. క్రిమినల్స్ చేతిలో దేశం బంధీ అయిందని.. మోడీ, అమిత్‌షా దేశంలోని వనరులన్నింటిని అమ్మేశారని అన్నారు. జెవివి పూర్వ అధ్యక్షులు కెఎల్.కాంతారావు మాట్లాడుతూ రాజ్యం అంతర్జాతీయంగా, జాతీయంగా, రాష్ట్రీయంగా సైన్సు పరిశోధనలకు ఎలాంటి ప్రోత్సాహం ఇవ్వడం లేదన్నారు. తమ అనాలోచిత ప్రభుత్వ పాలసీలతో ప్రజలను మూఢత్వంవైపు మరల్చుతూ చైతన్య రహితుల్ని చేస్తోందన్నారు. ఎపి జన విజ్ఞాన వేదిక ప్రధాన కార్యదర్శి జి.మురళీధర్ రెండు తెలుగు రాష్ట్రాలలో సైన్స్ ప్రచారంలో మరింత సమన్వయంతో కలిసి పని చేయాలన్నారు. సభకు ముందుగా మూఢ నమ్మకాలను నమ్మవద్దంటూ కళాకారులు గీతాలను ఆలపించారు. మూఢ నమ్మకాలు, అశ్లీలతకు వ్యతిరేకంగా ప్రచురించిన పలు పుస్తకాలను అతిథులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో జెవివి నల్గొండ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చంద్రశేఖర్ రెడ్డి, అమరయ్య రాష్ట్ర కార్యదర్శి వెంకట రమణారెడ్డి, రాష్ట్రంలోని 33 జిల్లాల నుండి విచ్చేసిన ప్రతినిధులు పాల్గొన్నారు.

పేదల గుడిసెలపై పెద్దల కన్ను

- ఇళ్లను కూల్చి బిఆర్‌ఎస్ జెండా గద్దె నిర్మాణం
- స్థలాన్ని విక్రయించాలని బిఆర్‌ఎస్ నేతల హుకుం..

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

భూకబ్జాలకు పాల్పడుతున్న వారిపై, పేదల ఇళ్లను ఆక్రమించిన వారిపై పోలీసులు కఠిన చర్యలు తీసుకున్నప్పటికీ నేతల ఆగడాలు మాత్రం ఆగడం లేదు. గ్రేటర్ వరంగల్ 13వ డివిజన్ పరిధిలో ఎంహెచ్‌నగర్ పేరుతో సర్వే నెంబర్ 308లోని 10 ఎకరాల ప్రభుత్వ స్థలంలో 2003లో సిపిఎం ఆధ్వర్యంలో 650 గుడిసెలు వేసుకుని పేదల నివసిస్తున్నారు. వారికి హౌస్ హోల్డర్ సర్టిఫికెట్ వచ్చింది. ఇంటి పన్ను, కరెంటు బిల్లులు కడుతున్నారు. ఇటీవల స్థానిక కార్పొరేటర్ సురేష్ జోషి అండతో స్థానిక బిఆర్‌ఎస్ పార్టీ నాయకులు ఓ కమిటీగా ఏర్పడి ఖాళీ ప్లాట్లు కనిపిస్తే కబ్జాలకు పాల్పడుతున్నారు. ఇదే క్రమంలో కాలనీకి చెందిన దామెర మైబుబి (మంజుల) అనే మహిళ ఇంటిని శుక్రవారం రాత్రికి రాత్రి తీసివేసి ఆ స్థానంలో బిఆర్‌ఎస్ జెండా గద్దె నిర్మాణాన్ని చేపట్టారు. దీంతో శనివారం బాధితురాలు మైబుబి తన కుటుంబ సభ్యులతో కలిసి ఆందోళనకు దిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 17 ఏళ్ల క్రితం తాను గుడిసె వేసుకుని నివసిస్తున్నానని, తనకు హౌస్ హోల్డర్ సర్టిఫికెట్ వచ్చిందని, ఇంటి పన్ను, కరెంటు బిల్లులు కూడా కడుతున్నానని తెలిపారు. తన ఆరోగ్యం బాగాలేక తన పుట్టినిళ్ళు అయిన వర్ధన్నపేటకు వెళ్లగా ఎంహెచ్ నగర్ కాలనీ బిఆర్‌ఎస్ అధ్యక్షుడు కంచె రాజు తనకు ప్లాట్ అమ్మాలని ఒత్తిడి చేశారన్నారు. ఈ విషయాన్ని స్థానిక కార్పొరేటర్ సురేష్ జోషి దృష్టికి తీసుకెళ్లగా ఆయన కూడా ప్లాటు రాజుకు అమ్మాలని, నీకు మరోచోట చూపిస్తామంటే అందుకు తాను నిరాకరించినట్టు చెప్పారు. శుక్రవారం రాత్రి సమయంలో తన ఇల్లును తొలగించి బిఆర్‌ఎస్ పార్టీ జెండా నిర్మాణాన్ని చేపట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. తన ప్లాటు తనకు దక్కాలని లేనిపక్షంలో కుటుంబంతో సహాఆత్మహత్య చేసుకుంటానని అందుకు స్థానిక కార్పొరేటర్ తోపాటు కంచె రాజు, సంచు కృష్ణ, కప్పల స్వామి, కురువల రాజు, బాదాని సంతోష్‌లే కారణమని అన్నారు.

రేపటి నుంచి అవధాన శిక్షణా సప్తాహం

ప్రజాశక్తి-కల్చరల్

తెలుగు భాషకు మాత్రమే సొంతమైన అవధాన ప్రక్రియ మరుగు కాకుండా రాబోయే తరాలకు అందించలన్న ధ్యేయంతో అవధాన విద్యా వికాస్ పరిషత్ ఏర్పడింది. అవధాన శిక్షణ శిబిరం ఈ నెల 8 నుంచి 14వ తేదీ వరకు సప్తాహంగా పద్మారావు నగర్‌లోని శివానంద ఆశ్రమంలో నిర్వహిస్తున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను శనివారం మసాబ్ ట్యాంక్ వద్ద ఉన్న ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కెవి.రమణ నివాస కార్యాలయంలో జరిగిన పత్రిక విలేకరుల సమావేశంలో పరిషత్ గౌరవ అధ్యక్షుడు డాక్టర్ రమణ అధ్యక్షుడు మరుమాముల దత్తాత్రేయ శర్మతో కలిసి తెలిపారు. అవధాన శిక్షణ శిబిరం రెండోదని, గతంలో శిక్షణ పొందిన వారిలో సాహిత్, హర్షలు ఉన్నత ఉద్యోగాలు చేస్తూ అవధానం ప్రదర్శనలు ఇస్తూ పేరుపొందారని తెలిపారు. వారంపాటు జరిగే శిక్షణ శిబిరంలో పాల్గొనే వారికి ఉచిత వసతి భోజనం సదుపాయం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. డాక్టర్ రమణ మాట్లాడుతూ సాంకేతిక విద్యకు ప్రాధాన్యత నేడు ఎక్కువగా ఉందని భాషపై మమకారం కల్పించకపోతే విఖ్యాత అవదానులు నాగ ఫణిశర్మ, మెడసాని మోహన్, గరికపాటి నరసింహారావు వంటి వారు మరో తరంలో రారని అన్నారు.

ఆదివాసీ సమస్యలపై సమరశీల పోరు

- టిఎజిఎస్ రాష్ట్ర అధ్యక్షులు బాబూరావు
- పలు తీర్మానాలకు ఆమోదం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర మహాసభలు శనివారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం పట్టణంలో ముగిశాయి. ఆదివాసీలు ఎదుర్కొంటున్న పలు రకాల సమస్యలపై తీర్మానాలను మహాసభ ఏకగ్రీవంగా ఆమోదించింది. ఆదివాసీల సమస్యలపై రానున్న కాలంలో సమరశీల పోరాటాలను నిర్వహించాలని మహాసభ పిలుపునిచ్చింది. ఈ మేరకు మహాసభ తీర్మానాలు, వివరాలను తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు, మాజీ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ మిడియా బాబూరావు మీడియాకు విడుదల చేశారు.ఆదివాసీల సాగులో ఉన్న పోడు భూములకు హక్కు పత్రాలు ఇవ్వాలని మహాసభ డిమాండ్ చేసింది. బతుకుదెరువు కోసం తెలంగాణ భూభాగంలోకి వచ్చి నాలుగు దశాబ్దాలకు పైగా ఇక్కడే జీవనం సాగిస్తున్న వలస ఆదివాసీలకు ఎస్‌టి కులం సర్టిఫికెట్లు జారీ చేయాలి. వారికి విద్యా, వైద్యం ఉపాధి అవకాశాలను కల్పించాలి. వలస ఆదివాసీ గ్రామాల్లో పాఠశాలలు అంగన్వాడీ కేంద్రాలను ఏర్పాటు చేయాలి. వారికి ఆశ్రమ పాఠశాలలు గురుకుల విద్యాలయాలు కళాశాలలో సీట్లను కేటాయించాలి. ఎస్టీ సబ్ ప్లాన్ నిధులను సక్రమంగా ఖర్చు చేయాలని, ఎస్టీ జనాభా ప్రాతిపదికన కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు బడ్జెట్లో నిధులు కేటాయించాలని తీర్మానం ఆమోదించింది.

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల పరిధిలోని ప్రభుత్వ విభాగాలలో లక్షలాది ఎస్‌టి బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయకుండా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పెండింగ్‌లో ఉంచాయని ఈ పోస్టులన్నింటిని తక్షణమే భర్తీ చేయాలి. ప్రయివేటు రంగ పరిశ్రమల్లో స్థానిక గిరిజన యువత యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించాలి. ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలను సంరక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. మాతృభాషలో విద్యాబోధన కొనసాగించే విధంగా ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలి. లిపిని తయారు చేయటం కోసం ప్రభుత్వాలు ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలి. రాష్ట్రంలో తునికాకు బోనస్ పంపిణీ వెంటనే ప్రారంభించాలని తీర్మాణం ఆమోదించింది.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటండి

గ్రీన్‌ఇండియా ఛాలెంజ్ ద్వారా పిలుపునిచ్చిన ఆర్.నారాయణ మూర్తి

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటాలని సినీనటులు, పీపుల్స్ స్టార్ ఆర్.నారాయణమూర్తి పిలుపునిచ్చారు. ఎంపి సంతోశ్‌కుమార్ చేపట్టిన గ్రీన్ ఇండియా ఛాలెంజ్‌లో భాగంగా శనివారం జూబ్లీహిల్స్ జిహెచ్‌ఎంసి పార్కులో ఆయన మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆర్.నారాయణమూర్తి మాట్లాడుతూ.. సిఎం కెసిఆర్ హరితహారం స్ఫూర్తితో ఎంపి సంతోష్ కుమార్ గ్రీన్ ఇండియా ఛాలెంజ్ చేపట్టి ఒక ఉద్యమంలా ముందుకు తీసుకువెళ్తున్నారని ప్రశంసించారు. దేశవ్యాప్తంగా ఎందరినో ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం చేస్తూ పర్యావరణ పరిరక్షణకు తోడ్పడుతున్నారని ప్రశంసించారు. సకాలంలో వర్షాలు కురవాలన్నా, వాతావరణంలో మార్పులను అరికట్టాలన్నా మొక్కలను నాటడం ద్వారానే సాధ్యమన్నారు.సిఎం కెసిఆర్ నాయకత్వంలో తెలంగాణ సస్యశ్యామలంగా మారిందన్నారు.